## క్లుప్తంగా

### నేటి నుంచి బ్రూసెల్లోసిస్ టీకాలు

పొదిలి రూరల్: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద బుధవారం నుంచి బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు ఉప్పుగుండూరు వాయుపాలెం పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమం డిసెంబర్ 12వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతుందని పేర్కొన్నారు. బ్రూసెల్లోసిస్ వ్యాధికి చికిత్సలేదని, నివారణకు కేవలం టీకా ఒక్కటే మార్గమని చెప్పారు. వ్యాధి కారణంగా పశువుల్లో జ్వరం, బలహీనత, చూడి ఆఖరి దశలో గర్భస్రావం, చూడి నిలవకపోవడం, కీళ్ల వాపు లాంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. మాయ, పాల ద్వారా ఇతర జంతువులకు, అలాగే మనుషులకు వ్యాప్తిస్తుందన్నారు. అందువల్ల 4–8 నెలలు వయసు కలిగిన పెయ్య దూడలకు తప్పనిరిగా టీకా వేయించాలని సూచించారు. పాలను బాగా మరిగించి వినియోగించుకోవాలని స్పష్టం చేశారు.

### ఆలయ భూములు రక్షిస్తాం



బోర్డు ఏర్పాటు చేసిన ఈఓ శ్రీనివాసరెడ్డి

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని మార్కెట్ యార్డు దగ్గర ఉన్న శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టినట్లు ఈఓ జి.శ్రీనివాసరెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ భూమిలో ఉన్న ఆక్రమణలు, చిల్లచెట్లు తొలగించి బోర్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎవరైనా ఆలయ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### అనాథాశ్రమానికి నిత్యావసర వస్తువులు పంపిణీ



గిద్దలూరు రూరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా సత్యసాయి సేవా సమితి వారు పట్టణంలోని పీఆర్ కాలనిలో గల సంజీవని అనాథాశ్రమానికి మంగళవారం నిత్యావసర వస్తువులు అందజేశారు. ముందుగా పట్టణంలోని రేడియో బావి సమీపంలో గల సత్యసాయి సేవా మందిరంలో ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, సామూహిక రుద్రపఠనం తదితర పూజలు నిర్వహించారు. రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు ఎస్.అనంతరామయ్య, సభ్యులతోపాటు అనాథాశ్రమం నిర్వాహకుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

### ఉత్సాహంతో చదవాలి



బహుమతులు అందజేస్తున్న డీవైఈవో

మార్కాపురం టౌన్: విద్యార్థులు ఉత్సాహంగా విద్యనభ్యసిస్తూనే క్రీడల్లో రాణించాలని డీవైఈఓ శామ్యూల్ జాన్ సూచించారు. మంగళవారం మార్కాపురంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బంగారు బాల్యం వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, వాక్చాతుర్యం, చిత్రకళ, డ్రాయింగ్, లోగో, నినాదాలు అంశాల్లో డివిజన్ స్థాయి పోటీలు నిర్వహించారు. డీవైఈఓ మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. ఒకో విభాగం నుంచి ముగ్గురు విజేతలను ప్రకటించారు. వాక్చాతుర్యంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వై.వి.టీ చంద్రకళ, కె.శ్రీనివాసులు, వి.జోషిత గెలుపొందారు. వ్యాసరచనలో ఎస్కేవీ మెహేస్, ఎస్కే సుల్తానా బేగం, కె.రామ్‌చరణ్ తేజ, చిత్రకళలో కె.జాన్ డేవిడ్, బి.శృతి, జి.ప్రవీణ్‌కుమార్, డ్రాయింగ్‌లో యు.ఓబులమ్మ, కె.సులోచన, ఎస్.పల్లవి, లోగోలో అంకిత, బి.నాగమణి, జె.మధురిమ, నినాదాల పోటీలో ఎస్కే ఆయేషా, ఎం.మమత, ఎస్.నందినిలు గెలుపొందారు. విజేతలకు డీవైఈవోతోపాటు ఎంఈవోలు రాందాస్‌నాయక్, శ్రీనివాసుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సీనియర్ ఉపాధ్యాయులు శ్యామ్ శుభకర్, ఎన్.వెంకటేశ్వర్లు, గౌతంబాబు, ఒ.రవిశేఖర్‌రెడ్డి, షేక్ అమీర్‌బాషా, షేక్ మునీర్‌భాషా, రంగాచారి, ఎస్.భాస్కర్‌రెడ్డి, ఎ.ప్రభాకర్‌రెడ్డి, ఓవీ వీరారెడ్డి, జీఎల్ రమేష్‌బాబు, రత్నరాజు, సక్రునాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

### డ్రెయినేజీ నిర్మాణం కోరుతూ ధర్నా నేడు

పొదిలి: పట్టణంలోని ప్రధాన రహదారిలో ఆక్రమణలు తొలగించిన అధికారులు డ్రెయినేజీ నిర్మించకుండా వదిలేయడం దారుణమని సీపీఎం పొదిలి ప్రాంతీయ కమిటీ కన్వీనర్ పి.బాలనరసయ్య ఒక ప్రకటనలో విమర్శించారు. కాలువలు నిర్మించాలని కోరతూ బుధవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అధికారుల తీరుతో సమస్య రెట్టింపు అయిందని, ట్రాఫిక్ సమస్య పెరగడమే కాకుండా, మురుగు ఎక్కడిదక్కడే నిల్వ చేరి దుర్వాసన వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరి దుకాణాల ముందు వారే డ్రెయినేజీ నిర్మించుకోవాలని చెప్పడం ప్రభుత్వ వైఖరిని తేటతెల్లం చేస్తోందని దుయ్యబట్టారు. ఆక్రమణల తొలగింపుతో జీవనోపాధి కోల్పోయిన చిరు వ్యాపారులకు ప్రత్యమ్నాయ ఉపాధి మార్గాలు చూపాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### గుంతల దారుల్లో..

# అవస్థల ప్రయాణం



గొట్లగట్టు బస్టాండ్ సమీపంలో రహదారిపై గుంతలు

పొదిలి/కొనకనమిట్ల: రహదారుల మరమ్మతులను, నూతన రోడ్ల నిర్మాణాన్ని పాలకులు గాలికొదిలేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్ల మీద పాలు పోసి ఎత్తుకోవచ్చన్నట్లుగా ప్రచారం చేసిన వారు 'సంపద సృష్టి'లో మునిగిపోయారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి గద్దెనెక్కి ఆరు నెలలవుతున్నా రోడ్ల సంగతి పట్టించుకోకపోవడాన్ని ప్రజలు తూర్పారబడుతున్నారు. ఒంగోలు–కర్నూలు రోడ్డులో ఏలూరు బ్రిడ్జి, ఉప్పలపాడు బస్టాండ్, కాటూరివారిపాలెం సమీపంలో, పెద్ద మసీదు వద్ద, మార్కాపురం అడ్డరోడ్డు వద్ద, దర్శి రోడ్డులోని పెద్ద చెరువు అలుగు వాగు వద్ద, ముసి బ్రిడ్జిపైన, మల్లవరం బ్రిడ్జిపైన భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాలు సమీపిస్తుండగానే వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్న పరిస్థితి. పలుమార్లు వాహనాలు అదుపు తప్పి బోల్తా పడిన సందర్భాలున్నాయి. పూర్తి స్థాయి మరమ్మతులు సంగతి అటుంచితే కనీసం గుంతలైనా పూడ్చాలి కదా అని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒంగోలు–కర్నూలు హైవేపై కొనకనమిట్ల మండలం గొట్లగట్టు బస్టాండ్ సెంటర్లోని రెండు స్పీడ్ బ్రేకర్ల వద్ద ఏర్పడిన గోతులు వాహనదారులకు చుక్కలు చూపెడుతున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు ఈ గుంతల వద్ద తమ సీట్లోనే అర అడుగు మేర ఎగిరిపడుతున్న పరిస్థితి. పైగా వర్షం కురిస్తే భారీగా నీరు నిల్వ చేరుతుండటంతో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు, కార్ల యజమానులు పడుతున్న తిప్పలు అన్నీఇన్నీ కావు. ఈ మార్గంలో జిల్లా ఉన్నతాధికారులు సైతం రాకపోకలు సాగిస్తున్నా గొట్లగట్టు బస్టాండ్ వద్ద పరిస్థితిలో ఎలా మార్పూ కనిపించడం లేదు. ప్రజాప్రతినిధులు, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గోతులు పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఉప్పలపాడు బస్టాండ్‌లో ఇలా..



దర్శి రోడ్డులోని పెద్ద చెరువు అలుగు వాగు వద్ద..



ముసి వాగు బ్రిడ్జిపై గోతులు



మల్లవరం వద్ద దర్శి రోడ్డులో బ్రిడ్జిపై..



పట్టణంలోని పెద్ద మసీదు వద్ద ప్రధాన రహదారి దుస్థితి ఇదీ..

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు



మాట్లాడుతున్న ఎస్సై రవీంద్రారెడ్డి

మార్కాపురం: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని సీఐ సుబ్బారావు సూచించారు. మంగళవారం స్థానిక సాధనా డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. అపరిచితులకు ఓటీపీ చెప్పవద్దని, వారు పంపే వెబ్‌లింక్‌లు ఓపెన్ చేయవద్దని స్పష్టం చేశారు. పోలీసులమని చెప్పి వాట్సప్ కాల్‌లో బెదిరింపులకు పాల్పడేవారి సమాచారం వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు కూడా సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్‌శాస్త్రి, ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక జంక్షన్‌లోని యశ్వంత్ హైస్కూల్లో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఫోన్‌కు అపరిచితుల నుంచి మెసేజ్ రూపంలో వచ్చిన వెబ్ లింక్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గౌరీకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక కేజీబీవీలో మంగళవారం సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఎస్సై వేమన, ప్రత్యేకాధికారి అనూరాధ పాల్గొన్నారు.

రాచర్ల: మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే సీజ్ చేస్తామని, తల్లిదండ్రులపైనా చర్యలు తప్పవని గిద్దలూరు రూరల్ సీఐ జె. రామకోటయ్య హెచ్చరించారు. స్థానిక స్పందన స్కూల్లో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్సై కోటేశ్వరరావు, స్పందన స్కూల్ డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పంటల బీమా రుసుం చెల్లించాలి



గొట్లగట్టులో పల్లాకు తెగులు సోకిన మినుమును పరిశీలిస్తున్న ఏఓ



శనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ జక్కం మెర్సీ

బేస్తవారిపేట: రబీ సీజన్‌లో సాగు చేసిన శనగ, మిరప, వరి, మొక్కజొన్న, మినుము పంటలకు రైతులు బీమా చేయించుకోవాలని ఏఓ జక్కం మెర్సీ సూచించారు. మంగళవారం పూసలపాడు, ఒందుట్లలో రైతులతో ఆమె మాట్లాడారు. ఎకరా శనగ పంటకు రూ.328, వరికి రూ.215, మిరపకు రూ.525, మినుము రూ.102, జొన్నకు రూ.60, మొక్కజొన్నకు రూ.105, పత్తికి రూ.2100 రుసుంను రైతులు చెల్లించి, ఈ పంటలో వివరాలు నమోదు చేయించుకోవాలని స్పష్టం చేశారు. ఉద్యానశాఖాధికారి డి.శ్వేత, ఏఈఓ ఆదిగణేష్, వీఏఏ నవీన్ పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: పంటల సాగు సమయంలో విత్తనశుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను కట్టడి చేయవచ్చని ఏఓ విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నరవ, మోడంపల్లె గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. శనగ, కంది రైతులకు సూచనలిచ్చారు. ఎంపీఈఓ శ్రీనివాసరెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: వాతావరణానికి అనుగుణంగా ఉండే పంటలు సాగు చేసి అధిక దిగుబడి పొందాలని రైతులకు ఏఓ ప్రసన్న రంగలక్ష్మి సూచించారు. గొట్లగట్టు, చినమనగుండం గ్రామాల్లో మినుము, అలసంద పంటలను పరిశీలించారు. మినుములో పల్లాకు తెగులు, ఆకుమచ్చ తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కొమరోలు: కందిలో మచ్చల పురుగును నివారిస్తే అధిక దిగుబడి పొందవచ్చని ఏడీఏ డి.బాలాజీనాయక్ పేర్కొన్నారు. మండలంలోని కొమరోలు, ఇడమకల్లు గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. మచ్చల పురుగు నివారణకు 400 ఎంఎం క్లోరిఫైరిఫాస్, 500 ఎంఎల్ వేపనూనె కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కె.రాజశ్రీ, రైతులు పాల్గొన్నారు.

కంభం: మిరపను ఆశించిన ఎండు తెగులు నుంచి రక్షణ పొందడానికి రైతులు పంట మార్పిడిని అవలంబించాలని ఉద్యానశాఖాధికారి శ్వేత సూచించారు. కంభంలో మిరప రైతులతో మాట్లాడుతూ.. గత నెలలో కురిసిన వర్షాల వల్ల మిరపకు ఎండు తెగులు ఆశించిందని, దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. ఉద్యానవన విస్తరణాధికారి శేషగిరి, వీఏఏలు రబ్బాని, రైతులు పాల్గొన్నారు.

తర్లుపాడు: మంగళకుంట, తర్లుపాడులో రైతులకు కంది, మినుములో యాజమాన్య పద్ధతులను ఏఓ వెంకటేశ్వర్లు వివరించారు. మచ్చల పురుగు, లద్దె పురుగులను నివారించే మార్గాలను రైతులకు సూచించారు. వీఏఎలు దేవేంద్ర, గోవింద్ బాషా, వెంకటేశ్వర్లు, రామయ్య, వీఏఎస్ విష్ణు, మైక్రో ఇరిగేషన్ సిబ్బంది ఎం.ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

రాచర్ల: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవాలని ఏఓ షేక్.అబ్దుల్ రఫీ సూచించారు. మండలంలోని అనుములపల్లె రైతు సేవా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో యాజమాన్య పద్ధతులపై మంగళవారం శిక్షణ కార్యాక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ సరిగిరి రమేష్, వీఏఏలు రమణ, రజిత, లలిత పాల్గొన్నారు.

### మార్కండేశ్వరునికి అన్నాభిషేకం



అన్నాభిషేకంలో మార్కండేశ్వరుడు

మార్కాపురం టౌన్: స్థానిక మార్కండేశ్వర ఆలయంలో స్వామివారికి మంగళవారం అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి జన్మ నక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకుని ఆలయ అర్చకులు అంజనేయ ప్రసాద్, వరుణ్‌తేజ, అర్చక బృందం వేద మంత్రాల మధ్య అన్నాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### వాహనదారులపై కేసులు



వాహనాల పత్రాలు పరిశీలిస్తున్న ఎంవీఐ

పొదిలి: స్థానిక మార్కాపురం రోడ్డులో మంగళవారం దర్శి ఎంవీఐ రవికుమార్ వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహన యజమానులపై కేసులు నమోదు చేశారు. రూ.70 వేల జరిమానా విధించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ సుందరరావు పాల్గొన్నారు.

### బెల్టుషాపులపై ఆకస్మిక దాడులు



కంభం: స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న సీఐ

కంభం: ఒంగోలు ఎన్ఫోర్స్‌మెంట్, మార్కాపురం టాస్క్ ఫోర్స్ అధికారులు మంగళవారం బెల్టు షాపులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించి 30 క్వార్టర్ బాటిళ్లు, 8 ఫుల్ బాటిళ్లు సీజ్ చేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని తురిమెళ్ల గ్రామంలో వెంకటరంగమ్మ వద్ద 15 క్వార్టర్ బాటిళ్లు, బేస్తవారిపేట మండలం పీవీ పురంలో చిన్నపిచ్చయ్య వద్ద 8 ఫుల్ బాటిళ్లు, తాటిచర్ల రంగమ్మ వద్ద 15 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని, వారిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

గిద్దలూరు రూరల్: మండలంలోని దంతెరపల్లె గ్రామంలో ఓ వ్యక్తి మద్యం విక్రయిస్తున్నట్లు తెలియడంతో తన నివాసంలో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం సోదాలు నిర్వహించారు. నిందితుడి నుంచి 11 క్వార్టర్ల మద్యం స్వాధీనం చేసుకుని, అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు చెప్పారు. దాడిలో ఎక్సైజ్ సిబ్బంది శ్రీపతి, బత్తిని వెంకటేశ్వర్లు, హరిబాబు, షరీఫ్, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వాడాలి

కొమరోలు: బహిర్భూమికి వెళ్లకుండా మరుగుదొడ్లను వినియోగించాలని ఎంపీడీఓ మస్తాన్‌వలి సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరత్నం, స్వచ్ఛభారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ ఆర్నాల్డ్, హెచ్ఎం అశ్వనీకుమార్ పాల్గొన్నారు.